# కందిలి

www.kandilinews.com

న్యూస్.. దారిచూపే దీప శిఖ

శుక్రవారం | 22.05.2026 సంపుటి: 01 | సంచిక: 254 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800





మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి



# నవభారత నిర్మాణానికి.. పునాదులు వేసిన రాజీవ్ గాంధీ!

## మాజీ ప్రధాని సేవలను కొనియాడిన టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డిలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం

నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు నేతలు, కార్యకర్తలు

అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

2 లో

## సమస్యలు పరిష్కరించాలంటూ..

# కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్!

- నియోజకవర్గ అభివృద్ధి, తాగునీరు, రోడ్లు, భవనాలు, విద్య, విద్యుత్ తదితర అంశాలపై వినతిపత్రం
- 15వ ఫైనాన్స్ నిధులు సమ ప్రాధాన్యతతో విడుదల చేయాలని విజ్ఞప్తి
- కొనుగోళ్లు వేగంగా పూర్తి చేసి, అన్నదాతలకు ఊరట దక్కేలా చూడాలని విన్నపం
- ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన భూములకు సంబంధించి రైతులకు 600 గజాలు కేటాయించాలి
- జాతీయ రహదారి 65 విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలి



3 లో



5 లో

## ప్రాణాపాయం ఉందని తెలిసి...

# పరుగున వచ్చి రక్తమిచ్చారు!

- సంగారెడ్డిలోని ప్రైవేటు స్పత్రిలోచికిత్స పొందుతున్న మహిళ
- అత్యవసరంగా రక్తం ఎక్కించాలని తెలిపిన డాక్టర్లు
- బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ దృష్టికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు
- తాము ఇస్తామంటూ ముందుకొచ్చిన ఆరుగురు యువకులు







# నవభారత నిర్మాణానికి.. పునాదులు వేసిన రాజీవ్ గాంధీ!



- **మాజీ ప్రధాని సేవలను కొనియాడిన టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**
- **సంగారెడ్డిలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం**
- **నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు నేతలు, కార్యకర్తలు**
- **అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ**

**కందిలి, సంగారెడ్డి**

భారత మాజీ ప్రధానమంత్రి, స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్కులో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు.

**ఆధునిక భారత నిర్మాత!**

ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. యువతకు అవకాశాలు కల్పించడంలో, సాంకేతిక రంగ అభివృద్ధికి పునాది వేయడంలో రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. దేశ ఐక్యత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రిలో.. పండ్ల పంపిణీ!**

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. పండ్లు పంపిణీ చేస్తూ, వారితో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరాతీశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, సీడీసీ ఛైర్మన్ గడీల రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, పార్టీ నాయకులు కూన సంతోష్, ప్రభు గౌడ్ , కౌన్సిలర్లు తోపాజి వీణ హరీష్, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## సమస్యలు పరిష్కరించాలంటూ..

# కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్!

- నియోజకవర్గ అభివృద్ధి, తాగునీరు, రోడ్లు, భవనాలు, విద్య, విద్యుత్ తదితర అంశాలపై వినతిపత్రం
- 15వ ఫైనాన్స్ నిధులు సమ ప్రాధాన్యతతో విడుదల చేయాలని విజ్ఞప్తి
- కొనుగోళ్లు వేగంగా పూర్తి చేసి, అన్నదాతలకు ఊరట దక్కేలా చూడాలని విన్నపం
- ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన భూములకు సంబంధించి రైతులకు 600 గజాలు కేటాయించాలి
- జాతీయ రహదారి 65 విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలి



**కందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తక్షణమే దృష్టిసారించి పరిష్కరించాల్సిన సమస్యల గురించి ఆయనతో చర్చించారు. పలు కీలక అంశాలను కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వాటిని వేగంగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకత, క్షేత్రస్థాయిలో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు, ఈ వేసవిలో తాగునీటి ఇబ్బందులు తదితర అంశాల గురించి చర్చించారు.

**ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్లు – సూచనలు!**

- SDF కింద రూ.5 కోట్లతో నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనల లేఖను కలెక్టర్‌కు సమర్పించారు.
- మాజీ సర్పంచులకు సంబంధించిన 15వ ఫైనాన్స్ నిధులను వెంటనే గ్రామపంచాయతీలకు సమాన ప్రాధాన్యతతో విడుదల చేయాలని కోరారు.
- జొన్నలు, మక్కలు, శనగల కొనుగోళ్లు నిలిచిపోయాయని, వెంటనే కొనుగోలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అన్నదాతలు క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వారికి ఊరట దక్కేలా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.
- వరి ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని, నిర్లక్ష్యం కొనసాగితే అకాల వర్షాలకు ధాన్యం దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. గన్నీ బ్యాగుల సరఫరాలో ఆలస్యం, లారీల కొరతపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.
- చెర్లగోపులారం, ముబారక్‌పూర్ (ఏ) గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ముబారక్‌పూర్ (ఏ) గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు మొరం మట్టితో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.
- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎమ్మెల్యే కోటా కింద మంత్రి సూచించిన విధంగా 40 శాతం మంజూరు ఇవ్వాలని కోరారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.
- రెండు సంవత్సరాలుగా నిలిచిపోయిన సదాశివపేట ఎంపీపీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. సదాశివపేట పట్టణంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
- నర్సింగ్ కాలేజీలో ఫర్నీచర్ ఏర్పాటు చేస్తే వెంటనే వినియోగంలోకి వస్తుందని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. NHAI రోడ్డు పనులను వేగవంతం చేయాలని సూచించారు.
- HMDA ఆధ్వర్యంలో సంగారెడ్డి బైపాస్ వద్ద చేపడుతున్న 80 ఫీట్ల రోడ్డు అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రెండు పట్టణాలకు SDF నిధుల మంజూరు, సంగారెడ్డి పట్టణంలో TUFIDC నిధుల విడుదల అంశాలపై చర్చించారు.
- మునిదేవునిపల్లి గ్రామ అవసరాల కోసం 20 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. సదాశివపేట, సంగారెడ్డి, రాజంపేట, పెద్దాపూర్, అరుట్ల ప్రాంతాల్లో సబ్ స్టేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.
- 2026-27 సంవత్సరానికి రూ.1.98 కోట్లతో బోర్‌వెల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కంది మండలంలోని చిమ్నాపూర్ గ్రామంలో MPUPS పాఠశాల భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని కోరారు. సంగారెడ్డి, సదాశివపేటలకు సంబంధించి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు.
- సంగారెడ్డిలో మినీ హజ్ హౌస్ పూర్తి పనులకు అదనపు నిధులు విడుదల చేయాలని, అమృత్ పథకం పనులను వేగవంతం చేయాలని కోరారు. కంది మండలంలో కొత్త MPP భవనానికి రూ.2 కోట్ల మంజూరు రద్దయిన నేపథ్యంలో, SDF, TUFIDC, MRR గ్రాంట్ పనులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.
- బేగంపేట్ గ్రామంలో గ్రామకంఠం భూముల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంద్రకరణ్, కంది, అరుట్ల, ఫసల్ వాదీ ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ కింద రైతులకు కేటాయించాల్సిన 600 గజాల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు.

కందిలి
న్యూస్.. దారిచూపే దీప శిఖ
www.kandilinews.com




# ఆధునిక భారతశిల్పి రాజీవ్ గాంధీ!

- టెలికాం, కంప్యూటర్ రంగాల విప్లవ పితామహుడు
- నవోదయ విద్యాలయాల స్థాపకుడు, స్వాప్నికుడు
- ఆయన వేసిన పునాదులపైనే నేటి నవభారతం
- రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు అర్పించిన నీలం మధు ముదిరాజ్
- ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం

**కందిలి, పటాన్ చెరు**

భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

**ఆయన పదవీకాలం... సువర్ణాక్షరాలతో లిఖించదగిన సమయం!**

"రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న 1984-1989 కాలం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాలు, దూరదృష్టితో కూడిన విధానాలే నేటి నవభారత ప్రగతికి బలమైన పునాదులు. స్వార్థ రాజకీయాలకు చెక్ పెడుతూ 1985లో రాజీవ్ గాంధీ తెచ్చిన 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని, పారదర్శకతను కాపాడింది. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే నమ్మకంతో 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు కనీస వయస్సును 21 నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు. కోట్లాది మంది యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ"అని నీలం మధు కొనియాడారు.





**నవోదయ విద్యాలయాల స్థాపకుడు!**

"విద్యారంగాన్ని ఆధునీకరిస్తూ 1986జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ ప్రతిభను వెలికి తీసేందుకు ఆయన 'నవోదయ విద్యాలయాలు' స్థాపించారు. నేడు భారతదేశం ప్రపంచ ఐటీ, టెలికాం రంగాలలో సూపర్ పవర్‌గా ఎదగడానికి, పల్లెల్లో సైతం సాంకేతికత విస్తరించడానికి ఆనాడే రాజీవ్ గాంధీ వేసిన కంప్యూటర్ విప్లవ పునాదులే కారణమయ్యాయి. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ, మహిళా రిజర్వేషన్ల ఆలోచనకు ఆయనే శ్రీకారం చుట్టారు. అదే తదనంతర 73, 74 రాజ్యాంగ సవరణలకు మార్గదర్శకమైంది. దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి"అని నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు.

**పాల్గొన్నవారు వీరే!**

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పడమటి గోపాల్ రెడ్డి, సంగన్న గారి గోపాల్, మంజలి దస్తగిరి, అల్లంగారి నరసింహారెడ్డి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, నారాయణదాసు, మన్నే రాఘవేంద్ర, మణికంఠ, సందీప్ గౌడ్, లక్డారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, ముత్తంగి అశోక్, వెంకటేశ్, మురళి, స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.













# ప్రాణాపాయం ఉందని తెలిసి...
# పరుగున వచ్చి రక్తమిచ్చారు!

- సంగారెడ్డిలోని ప్రైవేటు స్పత్రిలోచికిత్స పొందుతున్నమహిళ
- అత్యవసరంగా రక్తం ఎక్కించాలని తెలిపిన డాక్టర్లు
- బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ దృష్టికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు
- తాము ఇస్తామంటూ ముందుకొచ్చిన ఆరుగురు యువకులు

**కందిలి, సంగారెడ్డి**

తీవ్ర అనారోగ్యం బారిన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు బ్లడ్ డోనార్స్ క్లబ్ సభ్యులు అండగా నిలిచారు. ప్రాణాపాయంలో ఉన్న ఆమెకు అత్యవసరంగా రక్తం ఎక్కించాలని డాక్టర్లు తెలిపారు. త్వరగా రక్తం దొరక్కపోతే ఆరోగ్య పరిస్థితి విషమిస్తుందని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న బ్లడ్ డోనార్స్ సభ్యులు ఆరుగురు తామున్నామని ముందుకొచ్చారు. సంగారెడ్డి పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

**బ్లడ్ డోనార్స్ క్లబ్ చొరవ!**

సంగారెడ్డి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఒక మహిళ చికిత్స పొందుతున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో, అత్యవసరంగా రక్తం కావాలని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తోచలేదు. వారు ఎంత ప్రయత్నించినా, రక్తం సర్దుబాటు చేయలేకపోయారు. ఇతరుల ద్వారా బ్లడ్ డోనార్స్ క్లబ్ గురించి తెలుసుకున్నారు. క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణకు ఫోన్ చేశారు. తమ కుటుంబసభ్యురాలి ఆరోగ్య పరిస్థితి, డాక్టర్లు చెప్పిన విషయాన్ని వివరించారు. తమకు సాయం చేయాలని కోరారు.

**ముందుకొచ్చిన.. ఆరుగురు సభ్యులు!**

సంగారెడ్డి పట్టణంలోని ఒక మహిళకు అత్యవసరంగా రక్తం కావాలని బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ కోరారు. ఈ వివరాలను తమ వాట్సాప్ గ్రూప్ లో షేర్ చేశారు. వెంటనే ఆరుగురు సభ్యులు స్పందిస్తారు. తమది అదే గ్రూప్ రక్తమని, ఇస్తామంటూ ముందుకొచ్చారు. బ్లడ్ డోనార్స్ క్లబ్ సభ్యులు సిద్ధు, పాండు, శివ, కార్తీక్, అమర్ పాల్, అఖిల్ కంది సమీపంలోని బ్లడ్ బ్యాంకుకు వచ్చారు. రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణ రక్త దాతలు సిద్ధు, ఇందూరి పాండు, శివ, కార్తీక్, అమర్ పాల్,అఖిల్ లకు సన్మానం చేశారు. రక్త దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.









# ఎలక్ట్రిక్ కారెక్కి... పార్టీ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్సీ!

- ఇంధన పొదుపు, గ్రీన్ ఎనర్జీపై విస్తృత ప్రచారమే లక్ష్యం
- ప్రధాని మోదీ ఇచ్చి పిలుపును ఆచరించిన అంజిరెడ్డి

**కందిలి, సంగారెడ్డి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపును ప్రోత్సహిస్తూ ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి స్వయంగా ఈవీ కారును నడిపారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని ఆయన నివాసం నుంచి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన లగ్జరీ పెట్రోల్, డీజిల్ కార్లను పక్కన పెట్టి, ఎలక్ట్రిక్ కారును డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఇంధన పొదుపు, గ్రీన్ ఎనర్జీపై విస్తృత అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు.

**ఆచరించి చూపాల్సిన బాధ్యత.. ప్రజాప్రతినిధులపై ఉంది!**

ప్రజాప్రతినిధులుగా ఇంధన పొదుపును తాము ఆచరించి చూపితేనే ప్రజల్లో మార్పు వస్తుందనే ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం చేశానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. పెరుగుతున్న పొల్యూషన్ , ఇంధన ధరల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడకం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశంలో గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒక్కరోజు అయినా ఈవీ వెహికల్స్ లేదా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి స్పష్టం చేశారు.





## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను...

# పారదర్శకంగా నిర్వహించాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి
- పార్టీల ప్రతినిధుల సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**కందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

**పారదర్శక ఓటరు జాబితా లక్ష్యంగా సమన్వయంతో సాగుదాం!**

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు తక్షణమే అన్ని నియోజకవర్గాలలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్ వివరాలను సమావేశంలో వివరించారు.

# రైతులను ఇబ్బందులు పెడుతున్న.. మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి!

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి
- లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలి
- రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్

**ంందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలో జరిగిన రైతు సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవటానికి కొనుగోలు కేంద్రాలలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా కేంద్రాల్లో లారీలు, హమాలీలు, టార్పాలిన్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనికి తోడు మిల్లర్ల వల్ల కూడా సమస్య వస్తోందన్నారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందించాలన్నారు. తరుగు పేరుతో క్వింటాలుకు 6 నుంచి 7 కిలోలు రైతుల నుంచి దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆయన ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలలో మంచి నీళ్లు, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి యస్.రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కె.రాజయ్య, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com